క్లుప్తంగా

జంగుబాయి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సక్కు

కెరమెరి: ప్రతీ ఒక్కరు కుల దేవతలను పూజించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని తుమ్మగూడలో కొలువైన జంగుబాయి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీలు డోలు సన్నాయిలతో ఘన స్వాగతం పలికారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఆదివాసీపై ఉందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'కంటి వెలుగు' విజయవంతం చేయాలి

చింతలమానెపల్లి: ఈనెల 18 నుంచి తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాబాపూర్-రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అజీముద్దీన్ అన్నారు. సోమవారం ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణకు ప్రణాళికా బద్ధంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కంటి వెలుగు క్యాంప్ వైద్యాధికారులు బండి సాయి కృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' నిర్వహించాలి

కౌటాల: కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి అన్ని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని తెలిపారు. సర్పంచ్ వొజ్జల మౌనిశ్, ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువును కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

కౌటాల: చింతలమానెపల్లి మండలంలోని రణవెల్లి గ్రామానికి చెందిన దనుకర్ సంగీత అనే గర్భిణీ ఆదివారం రాత్రి 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. సంగీతకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108కి సమాచారం అందించారు. సంగీతను అంబులెన్స్‌లో కౌటాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కౌటాల మండలంలోని కోయగూడ గ్రామ సమీపంలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ ఎర్రా అజయ్‌కుమార్ అంబులెన్స్‌లో డెలివరీ చేశారు. తల్లి, ఆడశిశువు క్షేమంగా ఉన్నారని, వారిని కౌటాల పీహెచ్‌సీకి తరలించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పైలెట్ సుభాష్ ఉన్నారు.

బౌద్ధ సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

కౌటాల: సిర్పూర్ తాలుకా బౌద్ధ సంఘం నూతన కమిటీని ఆదివారం కౌటాలలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం తాలుకా అధ్యక్షుడిగా బసర్కార్ విశ్వనాథ్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, దేవాజీ, శంకర్, ప్రేమనంద్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శిగా తుల్సిరాం, సదాశివ్, వెంకటి, ప్రచార కార్యదర్శిగా శ్యాంరావు, నర్సయ్య, దేవాజీ, కోశాధికారిగా మోహన్‌లాల్, కార్యవర్గ సభ్యులుగా మాధవ్, బండురావ్, రాజరాం, మారుతి, మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బౌద్ధ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన సభ్యులు తెలిపారు.

వీర్దండిలో డీఎస్పీ విచారణ

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో సోమవారం సాయంత్రం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ విచారణ చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో భాగంగా ఆయన విచారణ చేపట్టారు. డీఎస్పీ వెంట కౌటాల సీఐ బుద్దే స్వామి, ఎస్సై ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి పండుగ

- జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- ఆకట్టుకున్న ముగ్గులు



కెరమెరి: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ ఘనంగా జరుపుకున్నారు. ఆడపడుచులు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. పిండి వంటలు చేసుకున్నారు. చిన్నపిల్లలు గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు.

ఘనంగా కైట్ ఫెస్టివల్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో కైట్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సర్‌సిల్క్ వెల్ఫేర్ సొసైటీ మైదానంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో గాలి పటాలు ఎగురవేశారు. కార్యక్రమానికి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రజాబంధు ఫౌండేషన్ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చౌపన్‌గూడలో ఆకట్టుకున్న ముగ్గులు

కెరమెరి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఎంతో ఆకట్టుకున్నాయి. గ్రామానికి చెందిన 35మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఆత్రం బొజ్జిరావు, కుర్సెంగ్ ధర్మూ, ఆత్రం కుసుంబ్‌రావు, యువజన సంఘాల సభ్యులు యాదోశావ్, జంగు, తుకారాం, నాగోరావు, చిన్ను, వసంత్‌రావు, రాము తదితరులు ఉన్నారు.

వాయినాలు ఇచ్చిపుచ్చుకున్న మహిళలు

మకర సంక్రాంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. సంక్రాంతి తర్వాత వచ్చే రోజు కనుమ సందర్భంగా వాయినాలు ఇచ్చుకున్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఆదివారం సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ప్రజలు చకినాలు, పిండి వంటకాలు చేశారు. ఇళ్ల ముందర రంగురంగులతో ముగ్గులు వేసి ఆడపడుచులు మురిసిపోయారు.

మహంకాళి ఆలయంలో అన్నదానం

మండలంలోని ఇందిరానగర్‌లో గల స్వయంభూ మహంకాళి, దుర్గాదేవి ఆలయంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు భోజనాలు వడ్డించారు.

ఆసిఫాబాద్‌మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: సంక్రాంతి పండుగను మండలంలోని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. పండుగ పురస్కరించుకుని గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, యువతకు కబడ్డీ పోటీలు, రైతులకు ఎడ్ల బండ్ల పందేలు నిర్వహించారు. మండలంలోని బాబాపూర్ గ్రామంలో రైతులకు ఎడ్ల బండ్ల పోటీలను ఎంపీపీ మల్లికార్జున్ ప్రారంభించి గెలుపొందిన రైతులకు నగదు బహుమతి అందజేశారు. మోతుగూడలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, సర్పంచ్ సువర్ణ, లక్ష్మి, ఉప సర్పంచ్ రజిత, నాయకులు రాజయ్య, తిరుపతి, సంతోష్ ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సంక్రాంతి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి పండుగ కోసం మండల వాసులు వారి గృహాలను పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇళ్లల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, యువతులు గృహాల ముందు ముగ్గులు వేశారు.



కాగజ్‌నగర్‌టౌన్: బహుమతి అందజేస్తున్న పాల్వాయి హరీష్ బాబు



జిల్లాకేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న ప్రజలు



ఆసిఫాబాద్‌రూరల్: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

అనారోగ్యంతో రైలులో యువకుడి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న మహారాష్ట్రలో జైన్‌నగర్ జలగాం గ్రామానికి చెందిన మనోజ్‌విజయ్ (35) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. విజయవాడలో కూలీ పనిచేస్తున్న మనోజ్‌విజయ్ రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సొంతూరు వెళ్లేందుకు రైలు ఎక్కాడని, పరిస్థితి విషమించడంతో కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే మృతిచెందాడన్నారు. ఈ మేరకు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పాండురంగ నాయక్

కాగజ్‌నగర్‌రూరల్: కోసిని గ్రామపంచాయతీ పరిధిలోని ఊట్‌పల్లి, రేగులగూడ, కొలాంగూడ గ్రామాల్లో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ పాండురంగ నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. పేదల అభివృద్ధి కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, రిటైర్డ్ తహసీల్దార్ సుభాష్, రిక్యాప్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వెంకట్, సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాసవీ మాతా ఆలయంలో ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని వాసవీ మాతా ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మహిళలు ఆలయానికి చేరుకొని పసుపు, కుంకుమ, నోములు సమర్పించారు.

కొలాంల కొంగు బంగారం 'భీమన్న'

- ఈనెల 19 నుంచి భీమన్న దేవర జాతర
- పెద్దఎత్తున తరలిరానున్న ఆదివాసీలు



భీమన్న దేవర ఆలయం

తిర్యాణి: ఆదివాసీ తెగ కొలాంల కుల దైవం భీమన్న అయ్యాక్ (భీమన్న దేవర) జాతర మండలంలోని దంతన్‌పెల్లిలో ఘనంగా నిర్వహించనున్నారు. కొన్నేళ్లుగా కొలాంలు దేవుడికి పూజలు చేస్తుండడంతో పాటు ప్రతీ యేటా జనవరిలో మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తున్నారు. కొలాంల కొంగు బంగారంగా నిలిచిన భీమన్న దేవర జాతరకు పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలిరానున్నారు. ఈనేపథ్యంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

దట్టమైన అడవిలో వెలసిన దేవుడు..

మండలంలోని దంతన్‌పెల్లి గ్రామ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో భీమన్న దేవర వెలిశాడు. ఆలయం చుట్టూ అగ్నిదేవుడు, మైసమ్మ, పోచమ్మ గ్రామ దేవతలు వెలిశాయి. ఏన్నో ఏళ్ల నుంచి ఆత్రం వంశీయులు ఇక్కడ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇదే వంశానికి చెందిన కొట్నాక, పెందూర్, గెడం, తొడసం, ఉర్వేత, కోర్కేట, ఉయిక, మరప, సలాం, కుడిమెత, పెద్దలు అనే తెగలకు చెందిన పూజారులు మూడు రోజుల పాటు విడిది చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతరకు ఉమ్మడి జిల్లాలోని కొలాంతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆదివాసీలు సైతం తరలివస్తారు. ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్లను సైతం నిర్వహించనున్నారు.

భేటి ప్రత్యేకం..

మూడు రోజుల పాటు జరిగే జాతరలో సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహిస్తారు. మొదటి రోజు దేవస్థానంలోని దేవుని వన ప్రవేశం చేపట్టి, ఆదివాసీలకు చెందిన ఇతర దేవుళ్లతో కలిసి తిరిగి భీమన్న దేవుని ఆలయ ప్రవేశం చేస్తారు. అనంతరం భేటి నిర్వహిస్తారు. ఇందులో భాగంగా కొత్త దంపతులు మట్టితో దేవుని ప్రతిరూపాలను తయారు చేసి వాటికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆత్రం వంశానికి చెందిన పెద్దలకు కొత్త కోడళ్లను పరిచయం చేస్తారు. అప్పటి నుంచి వారందరిని ఆత్రం వంశ కోడళ్లుగా గుర్తిసారు. రెండో రోజు దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం జాతరతో పాటుగా దర్బార్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం దేవుళ్ల వన ప్రవేశం చేపడుతారు. మూడో రోజు ఆలయంలోని అమ్మ వారికి (పోచమ్మ) ప్రత్యేక పూజలు చేస్తారు.

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



నృత్యం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

తిర్యాణి: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని జెండాగూడ గ్రామంలో నిర్వహించిన భీమన్న జాతరకు ఆమె హాజరయ్యారు. దేవుడికి సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆదివాసీ మహిళలతో కలిసి నృత్యం చేశారు.

అన్ని ఏర్పాట్లు చేశాం




ఈనెల 19 నుంచి 21 వరకు దంతాన్‌పెల్లిలో జరిగే భీమన్న జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జాతర నిర్వహించే మూడు రోజుల పాటు అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నాం. జాతరకు ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు.

– ఆత్రం గంగారాం, జాతర నిర్వహణ కమిటీ చైర్మన్

పోస్టర్లు ఆవిష్కరణ

తిర్యాణి: ఈనెల 19 నుంచి 21వరకు మండలంలోని దంతన్‌పెల్లి గ్రామంలో నిర్వహించే భీమన్న జాతరకు అధిక సంఖ్యలో ఆదివాసీలు తరలిరావాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద జాతరకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆత్రం లక్ష్మణ్, జిల్లా రాయిసెంటర్ సార్‌మెడి కుర్సెంగ మోతిరాం, నాయకులు కోట్నాక గణపతి, నర్సింగరావు, ఆత్రం సంతోశ్ ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చాంబర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలానికి చెందిన మామిడి నాగయ్య తన తల్లిపేరుతో ఉన్న పట్టా భూమిని సోదరులకు సమానంగా పట్టా చేయాలని దరఖాస్తు చేయగా రోడ్లపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ పట్టణంలోని 9వ వార్డు కౌషల్‌నగర్‌కు చెందిన కాలనీ వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో తమ సంఘానికి 2 గుంటల భూమిని కేటాయించాలని కోరుతూ మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి శివ దరఖాస్తు అందజేశారు. ఇంకా పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



కెరమెరి: బహుమతులు అందిస్తున్న ఎంపీపీ

కెరమెరి: మండలంలోని చిన్నసాకడ (శ్యాంరావుగూడ)లో పెందోర్ జంగు స్మారకార్థం మూడు రోజుల క్రితం ప్రారంభమైన కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. మొత్తం 53 టీంలు పాల్గొనగా నిషాని జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో సుర్దాపూర్, మూడో స్థానంలో కెరమెరిలోని జై శ్రీరం జట్టు నిలిచాయి. ప్రథమ బహుమతి షీల్డ్‌తో పాటు రూ.7777లను ఎంపీపీ పెందోర్ మోతిరాం అందించగా, రెండో బహుమతిగా బాబాయూత్ అసోషియోషన్ కమిటీ సభ్యులు రూ.4444లు అందించారు. మూడో బహుమతి రూ. 2222లను మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనంద్‌రావు అందించారు. కార్యక్రమంలో సర్పంచులు సమిత్రబాయి, న్యానేశ్వర్, జగన్నాథ్‌రావు, ఉపసర్పంచ్ జారుబాయి, గ్రామ పేటేల్ దంబీరావు, నాయకులు భీంరావు, భరత్, కేశవ్, మానిక్‌రావు, శ్రీనివాస్, తుకారాం, వినేశ్, సాగర్, శంకర్, సోము తదితరులు ఉన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గ్రామంలో కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మురళీగూడ జట్టు విజయం సాధించగా మహారాష్ట్రలోని చిన్నవత్ర జట్టు రన్నరప్‌గా, జిల్లెడ జట్టు మూడో స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతిగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రూ.11వేలు, రన్నరప్‌కు సర్పంచ్ ఈశ్వరిబాయి రూ.7వేలు, మూడో బహుమతిగా కొండపల్లి సర్పంచ్ ఉపాసీ సంజీవ్ రూ.5వేలను అందజేశారు. ఉపసర్పంచ్ ప్రభాకర్, నాయకులు పేదం లచ్చిరాం, వెంకటి, నిర్వాహకులు కనక సంతోష్, మధుకర్, చక్రధర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం మండలంలోని వీర్దండి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో జంగుబాయి దీక్షపరులతో కలిసి గాబూర్ అకిపెన్ జెండా పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో ప్రజలు భక్తి మార్గంలో నడవాలని తెలిపారు. వీర్దండిలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, చింతలమానెపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, సర్పంచ్ మడావి రేణుక పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో రోగాలు నయం

బెజ్జూర్: ఆయుర్వేద వైద్యంతో రోగాలు నయమవుతాయని బెజ్జూర్ ఆయుర్వేద డాక్టర్ నేహ అన్నారు. సోమవారం మండలంలోని ఎలుకపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ చేశారు. అంతకుముందు ఆయుష్ కరపత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ కె.శారద, ఆయుర్వేద కంపౌండర్ వి.అశోక్ గౌడ్, నాయకులు రామకృష్ణ, భీంరావు, అటెండర్ ఖమరుద్దీన్ పాల్గొన్నారు.

కుమురంభీం ఆశయ సాధనకు కృషి



నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

వాంకిడి: కుమురంభీం ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని నవేదరి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుమురంభీం విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రతిఒక్కరూ భీం అడుగు జాడల్లో నడవాలన్నారు. ఎంపీపీ ముండె విమలబాయి, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్, సర్పంచులు సిడాం అన్నిగా, కోట్నాక కిష్టు, నాయకులు దీపక్ ముండె పాల్గొన్నారు.

వైభవంగా గొంతెమ్మ బోనాలు



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

పెంచికల్‌పేట్: మండలంలోని మెరెగూడ సమీపంలోని గొంతెమ్మ ఆలయంలో బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కొత్త కుండల్లో బోనం తయారు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చివరిరోజు ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం నిషానులు, దేవతామూర్తుల విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు హుండీ లెక్కింపు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయ హుండీని మంగళవారం లెక్కించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ ఇందారపు రాజేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.